క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

కొవ్వూరు: ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు, వారి సమస్యలు పరిష్కరించేందుకు శనివారం సాయంత్రం నాలుగున్నర నుంచి ఐదు గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆర్టీసీ కొవ్వూరు డిపో మేనేజర్ వైవీవీఎన్ కుమార్ శుక్రవారం తెలిపారు. కొవ్వూరు పరిసర గ్రామాల ప్రయాణికులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని ఆయన కోరారు. 91009 54631 అనే నంబర్‌కు కాల్ చేయాలని ఆయన సూచించారు.

ఆశ్రమం నిర్మాణానికి విద్యార్థుల విరాళం



ఆశ్రమానికి రూ.16 వేల విరాళం అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

నల్లజర్ల: వృద్ధులు, అనాథ పిల్లల ఆశ్రమానికి విద్యార్థులు విరాళం అందజేశారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు గ్రామంలో ఎకరం విస్తీర్ణంలో రూ.4 కోట్ల వ్యయంతో వృద్ధులు, అనాథ పిల్లల ఆశ్రమం (ఆనంద నిలయం) నిర్మాణం చేపట్టారు. మానవత సంస్థ, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఆశ్రమం నిర్మాణం జరుగుతోంది. ఈ ఆశ్రమానికి నల్లజర్ల మండలం తూర్పు చోడవరంలోని వివేకానంద స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.16,140 సేకరించి శుక్రవారం విరాళంగా అందజేశారు. ఈ విషయాన్ని ఆ స్కూల్ ప్రిన్స్‌పాల్ శ్రీనివాసరావు, హెచ్ఎం రాజు తెలిపారు.

డీసీసీ అధ్యక్షురాలిగా అరుణకుమారి



అరిగెల అరుణకుమారి

కొవ్వూరు: జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలిగా ఆ పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ అరిగెల అరుణకుమారి నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు నుంచి నియామక పత్రాలు అందాయని ఆమె శుక్రవారం తెలిపారు. ఇప్పటి వరకు ఆమె జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా, పీసీసీ డెలిగేట్‌గా పనిచేశారు. పెరవలి మండలం ముక్కామల ఈమె స్వగ్రామం.తనకు ఈ పదవి రావడానికి సహకరించిన పీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు, వర్కింగ్ కమిటీ అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మార్టిన్ లూథర్‌లకు అరుణకుమారి కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ ఎస్సీమోర్చా జిల్లా అధ్యక్షుడిగా సుమన్‌బాబు



దున్నా సుమన్‌బాబు

దేవరపల్లి: బీజేపీ ఎస్సీమోర్చా జిల్లా అధ్యక్షుడిగా దేవరపల్లికి చెందిన దున్నా సుమన్‌బాబు రెండోసారి నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు శుక్రవారం నియామక పత్రాన్ని అందజేశారు. సుమన్ బాబు గతంలో జిల్లా ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడిగాను, దేవరపల్లి మండల శాఖ అధ్యక్షుడిగాను, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గాను పనిచేశారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు.

20 బీరు సీసాలతో ఒకరి అరెస్టు

దేవరపల్లి: మండలంలోని ధుమంతునిగూడెంలో అక్రమంగా నిల్వ ఉంచిన 20 బీరు సీసాల (12.35 లీటర్లు)ను మారిశెట్టి శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద నుంచి శుక్రవారం ఎస్ఈబీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మారిశెట్టి శ్రీనివాస్‌ను అరెస్టు చేసినట్టు దేవరపల్లి స్టేషన్ సీఐ డి.సుధ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

- అందుకే ఊరూరా వైద్య శిబిరాలు
- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- డివిజన్‌లో ఏడు చోట్ల సురక్ష వైద్య శిబిరాలు

దేవరపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి, ఆరోగ్య శిబిరాల ద్వారా పేదలకు నాణ్యమైన వైద్యాన్ని అందిస్తోందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని దుద్దుకూరు గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే వెంకట్రావు ప్రారంభించారు. సర్పంచ్ బొంతా నాగమణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే తలారి మాట్లాడారు. శిబిరం వద్ద ఏర్పాటు చేసిన వైద్య పరీక్షల వార్డులను ఎమ్మెల్యే తలారి పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. శిబిరంలో వైద్యులు 553 మంది రోగులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అలాగే 86 మందికి కంటి పరీక్షలు చేశారు. 54 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ జి.సంధ్య, డాక్టర్లు టి.సూర్యకళ, హర్షవర్దన్, పి.గుణసూర్య, సాయి సుమంత్, మండల ప్రత్యేకాధికారి జి.రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ అంబేడ్కర్, తహసీల్దార్ ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.



దేవరపల్లి మండలం దుద్దుకూరులో రోగులకు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురంలో 250 మందికి..

గోపాలపురం: స్థానిక సచివాలయం -2 వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. ఈ శిబిరంలో వైద్యులు 250 మంది రోగులకు గుండె, బీపీ, షుగర్, ఎముకలు, శ్వాస సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. అత్యవసరమైన రోగులను రాజమహేంద్రవరం ఆసుపత్రులకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కె.శ్రీనివాసరావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్కె వల్లీ, సర్పంచ్ పైడి శిరీష, సొసైటీ చైర్మన్ కూసం రామమోహన్‌రెడ్డి,, తహసీల్దార్ బి.రవీంద్రనాథ్, ఎంపీడీఓ ఆర్ శ్రీదేవి, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



పెరవలి మండలం ఖండవల్లిలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్

అచ్చన్నపాలెంలో 502 మందికి..

నల్లజర్ల: నల్లజర్ల పీహెచ్‌సీ పరిధిలోని అచ్చన్నపాలెంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ జాలపర్తి సౌజన్య, ఎంపీటీసీ సభ్యుడు కాకర్ల రాజారావు ప్రారంభించారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శిబిరాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పిల్లల వైద్యురాలు తేజశ్రీ , ఆప్తమాలజిస్ట్ రామరత్నం, స్థానిక వైద్యులు వెంకట్రావు, సిరాజుద్దీన్‌లు 502 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు అందజేశారు. వారిలో 22 మందిని ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. శిబిరంలో నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీరావు తదితరులు పాల్గొన్నారు.

నెలటూరులో 485 మందికి..

చాగల్లు: మండలంలోని నెలటూరు సచివాలయం పరిధిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆర్థోపెడిక్, డెంటిస్ట్, జనరల్ అండ్ గైనిక్, ఆప్తమాలజిస్ట్‌లతో కూడిన వైద్య బృందం 485 మంది రోగులకు ఈ శిబిరంలో వైద్య సేవలు అందించారు. అవసరమైన వారిని పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేశారు. ఈసీజీ సేవలు కూడా అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు తాళ్లూరి రమ్య ఎంపీడీవో బి. రాంప్రసాద్, తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి, డాక్టర్ ఈ.తనుజ, వైద్య ఆరోగ్య సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

ఖండవల్లిలో 530 మందికి..

పెరవలి: మండలంలోని ఖండవల్లిలో నిర్వహించిన జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 530 మంది రోగులకు వైద్యులు పరీక్షలు చేశారు. వారిలో 28 మందిని ఆరోగ్యశ్రీ పథకంలో మెరుగైన చికిత్స కోసం ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేశామని స్థానిక వైద్యురాలు ఎ.కృష్ణవేణి తెలిపారు. రోగులకు ఎంపీపీ ప్రసాద్ చేతుల మీదుగా మందుల కిట్లు పంపిణీ చేశారు. గైనకాలజీ, నేత్ర, పిల్లల వైద్య నిపుణులు ప్రత్యూష, వీటీ వర్మ, హేమరాజు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దామోదరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కంద వెంకన్న, ఎంపటీసీ సభ్యులు బొకె వెంకటేశ్వర్లు, కేతా పద్మ, మొల్లేటి జగదీష్, వైఎస్సార్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డి.ముప్పవరంలో 587 మందికి..



డి.ముప్పవరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు

నిడదవోలు రూరల్: మండలంలోని డి.ముప్పవరం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, సర్పంచ్ నాగిరెడ్డి నాగదేవి ప్రారంభించారు. అనంతరం వృద్ధులకు మందులు, కళ్లజోళ్లు అందజేశారు. అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. మార్కొండపాడు పీహెచ్‌సీ వైద్యులు పి.రవికుమార్ పర్యవేక్షణలో ఆరుగురు స్పెషలిస్ట్ వైద్యులు 587 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సంగినీడి సత్యనారాయణ, స్థానిక నాయకులు మద్దాల ప్రభు, చిట్టియ్య, ముప్పిడి విజయ్, అజయ్‌కుమార్, ఎంపీడీఓ పి.శామ్యూల్, తహసీల్దార్ ఎం.గంగరాజు, ఈఓపీఆర్డీ రత్నమాలిక పాల్గొన్నారు.

పశివేదలలో 632 మందికి..

కొవ్వూరు: మండలంలోని పశివేదల-1 సచివాలయం పరిధిలో నిర్వహించిన సురక్ష వైద్య శిబిరంలో 632 మందికి వైద్య సేవలు అందించినట్టు దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ధర్మరాజు తెలిపారు.చర్మవ్యాధుల నిపుణుడు శ్రీనివాసవర్మ, జనరల్ ఫిజీషియన్ జయవర్ధిని, వైద్యులు బి.శ్రీనివాస్, జి.హరిశ్చంద్ర, కె.ప్రణీతలు రోగులకు వైద్య సేవలందించారు.

దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దు

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- గోపాలపురంలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

గోపాలపురం: దళారులకు ధాన్యాన్ని విక్రయించి మోసపోవద్దని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు రైతులకు సూచించారు. స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. గతేడాది కంటే రూ.141 ఎక్కువ రేటుకు ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. వ్యవసాయం దండగ అని టీడీపీ ప్రభుత్వం భావిస్తే, దానిని పండగ చేసి నిరూపించిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్మకాలు సాగించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, సర్పంచ్ పైడి శిరీష, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కూసం రామమోహన్‌రెడ్డి, ఏఓ బి .రాజారావు, ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి రైతులు జొజ్జవరపు ఆనందపాల్, ముల్లంగి శ్యామ్‌సుందర్‌రెడ్డి వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



గోపాలపురం ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



తాడిపూడిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ అధ్యక్షుడు, ఏవో

తాడిపూడి, తాళ్లపూడిలలో..

తాళ్లపూడి: జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ ఆదేశాల మేరకు మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి జి.రుచిత చెప్పారు. తాడిపూడి సొసైటీ ఆధ్వర్యంలో తాడిపూడి, తాళ్లపూడి రైతు భరోసా కేంద్రాల్లో శుక్రవారం ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిని సొసైటీ అధ్యక్షుడు మండిగ వెంకట గిరిధర్ ప్రారంభించారు. ఈ కొనుగోలు కేంద్రాల వద్ద టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హెల్పర్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ అందుబాటులో ఉంటారన్నారు. వారి సారథ్యంలో ధాన్యం కొనుగోలు జరుగుతుందని ఏవో తెలిపారు. ఈ రెండు చోట్లా 20 వేల గోనె సంచులను సిద్ధంగా ఉంచామని సొసైటీ కార్యదర్శి బొర్రా రామచంద్రం తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అప్పన జగదీష్, సొసైటీ డైరెక్టర్లు బి.బ్రహ్మయ్య, నామ ప్రకాశం, రైతులు పాల్గొన్నారు.

20 నుంచి కొనుగోలు కేంద్రాల ప్రారంభం

నిడదవోలు రూరల్: ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు నిడదవోలు మండల పరిధిలోని 22 ఆర్‌బీకేల్లో ఈనెల 20వ తేదీన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని తహసీల్దార్ ఎం.గంగరాజు తెలిపారు. మండలంలోని పురుషోత్తపల్లిలోని రైస్‌మిల్లులో ఉన్న గోనె సంచులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ ఖరీఫ్‌లో ధాన్యం సేకరణకు 12.50 లక్షల గోనె సంచులు అవసరమని గుర్తించామన్నారు. దీంతో నిడదవోలులో 18, చాగల్లు మండలంలో 5 రైస్‌మిల్లుల వద్ద గోనె సంచులను సేకరిస్తున్నామన్నారు. నాణ్యమైన చిరిగిపోని గోనె సంచులను రైతులకు అందించేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. రైతులు తీసుకున్న గోనె సంచులను 72 గంటల్లో తిరిగి ఆర్‌బీకేలకు అందించాలని సూచించారు. సివిల్ సప్‌లై డీటీ ఎం.అనిల్‌కుమార్, ఆర్ఐ సత్యేంద్ర, వీఆర్వోలు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

డైట్‌కు విచ్చేసిన ట్రైనీ కలెక్టర్ శ్రీపూజిత



ట్రైనీ కలెక్టర్ శ్రీపూజితకు స్వాగతం పలుకుతున్న ప్రిన్సిపాల్ రమణమూర్తి, సుబ్రహ్మణ్యం

నల్లజర్ల: ట్రైనీ కలెక్టర్ శ్రీపూజిత శుక్రవారం మండలంలోని దూబచర్లలోని ఉపాధ్యాయ శిక్షణ సంస్థ (డైట్) విచ్చేశారు. డైట్ కార్యకలాపాలపై ఒక రోజు శిక్షణ పొందే నిమిత్తం శ్రీపూజిత ఇక్కడకు వచ్చారు. ఆమెకు ప్రిన్సిపాల్ పీవీ రమణమూర్తి, ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం స్వాగతం పలికారు. సంస్థ కార్యకలాపాలు, శిక్షకుల ఎంపిక ఏ విధంగా ఉంటుంది? శిక్షణ కాల పరిమితి తదితర విషయాలను శ్రీపూజిత అడిగి తెలుసుకున్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత



దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందిస్తున్న మిథున్‌రెడ్డి, పిల్లి బోస్, మంత్రి తానేటి వనిత తదితరులు

కొవ్వూరు: ఓ దివ్యాంగ విద్యార్థికి శ్రీరామ సొసైటీ (కొవ్వూరు) అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర తన సొంత నిధులతో ట్రై సైకిల్ అందించాడు. తాళ్లపూడి మండలం, పెద్దేవం గ్రామానికి చెందిన సీనియర్ ఇంటర్ విద్యార్థి అయిన కాటసాని పృథ్వీ ఈ ట్రై సైకిల్‌ను ఆయన సమకూర్చారు. కొవ్వూరులోని మంత్రి తానేటి వనిత క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్లు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, హోం మంత్రి తానేటి వనిత చేతుల మీదుగా ఈ ట్రై సైకిల్‌ను ఆ వికలాంగుడికి అందజేశారు. నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు, పార్టీ కొవ్వూరు నియోజకవర్గ పరిశీలకుడు రాజీవ్‌కృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాలుర జట్టు

దేవరపల్లి: స్కూల్ గేమ్స్ అండర్-17 బాలుర ఫుట్‌బాల్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టు ఎంపిక పోటీలు గురువారం స్థానిక ఏఎస్సార్ జెడ్పీ హైస్కూ క్రీడా ప్రాంగణంలో జరిగాయి. ఎంపికైన క్రీడాకారుల వివరాలను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జి.బాబూరాజేంద్రబాబు శుక్రవారం ప్రకటించారు. బి. సురేంద్ర (దేవరపల్లి), కె. బలరాం (పల్లంట్ల), పి.వంశీతేజ (దేవరపల్లి), బి. నాగవెంకట్ (పల్లంట్ల), ఎ. ప్రియతం (పల్లంట్ల), ఎస్.భానుప్రకాష్ (పెదతాడేపల్లి), వి.భార్గవ్ దుర్గా గణేష్ (పెదతాడేపల్లి), ఎస్. సాక్ష్యం (పెదతాడేపల్లి), టి.ప్రణీత్ (పెదతాడేపల్లి), ఎం.నాగేంద్ర (కొవ్వూరు), పి.లుకే బాబు (కొవ్వూరు), ఎస్.అరవింద్ (చిన్నాయగూడెం), టీఎస్ఎస్ గుప్తా (తాడువాయి), పి.అస్లామ్ (దేవరపల్లి), ఎం. కుమారస్వామి (తడికలపూడి), టి. వినయ్ శ్రీ (రావికంపాడు), సీహెచ్ జస్వంత్ (వాదాలకుంట), టి. విక్రాంత్ (తాడేపల్లిగూడెం) ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులు నవంబరు 4,5,6 తేదీల్లో కర్నూలు జిల్లా ఎమ్మిగనూర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు తరపున ఆడతారన్నారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో నవదీప్



నవదీప్

దేవరపల్లి: స్కూల్ గేమ్స్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో స్థానిక ఏఎస్సార్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థి బాసిన నవదీప్ రాష్ట్ర జట్టు తరపున ఆడి సత్తా చాటాడు. సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 10 వరకూ అనంతపురంలో జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. నవదీప్‌తో కూడిన ఆంధ్రప్రదేశ్ జట్టు హిమాచల్ ప్రదేశ్, లక్షదీప్ జట్లపై విజయం సాధించింది. సిక్కిం జట్టుతో హోరాహోరీగా జరిగిన పోటీ డ్రా అయ్యింది. విద్యార్థి నవదీప్ ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్నాడు. 3వ తరగతి నుంచి ఫుట్‌బాల్‌లో శిక్షణ పొందుతున్నట్టు విద్యార్థి తెలిపారు.

రాష్ట్రస్థాయి త్రో బాల్ పోటీలకు ముగ్గురు ఎంపిక



కొవ్వూరు జెడ్పీ హైస్కూల్ నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీఈటీ నాగరాజు



వాడపల్లి జెడ్పీ హైస్కూల్ నుంచి ఎంపికైన సంతోష్‌కుమార్‌తో ఉపాధ్యాయులు

కొవ్వూరు: స్కూల్ గేమ్స్ అండర్-14, అండర్ -17 విభాగాల రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు కొవ్వూరు పట్టణం, మండలానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. పట్టణంలోని అల్లూరి నాగరత్నం జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థి పి.శివ (అండర్ -17), తొమ్మిదో తరగతి విద్యార్థి ఎం.యేసురాజు (అండర్-14) విభాగాల్లో ఎంపికయ్యారు. అలాగే కొవ్వూరు మండలం వాడపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి యర్లగడ్డ సంతోష్‌కుమార్ అండర్-17 విభాగంలో రాష్ట్ర స్థాయి త్రో బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. తణుకులో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ఈ ముగ్గురూ ప్రతిభ కనబరిచి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్లకు ఎంపికయ్యారు. త్వరలో కడపలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ ముగ్గురూ పశ్చిమ గోదావరి జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారు. ఎంపికైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీలను పట్టణంలోని అల్లూరి నాగరత్నం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాస రామానుజం, వాడపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.యుగంధర్‌కుమార్ అభినందించారు.

నిడదవోలు చేరుకున్న పాదయాత్ర

నిడదవోలు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించాలని కోరుతూ ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన ప్రైవేట్ టీచర్, వైఎస్సార్ సీపీ అభిమాని షేక్ జిలాని చేపట్టిన పాదయాత్ర శుక్రవారం నిడదవోలు చేరుకుంది. షేక్ జిలానికి నిడదవోలు వైస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా షేక్ జిలానీ మాట్లాడుతూ ఇప్పటి వరకూ 17 జిల్లాల్లో పాదయాత్ర పూర్తి చేశామన్నారు. నిడదవోలు నుంచి తణుకు, భీమవరం, పాలకొల్లు మీదగా కోనసీమ జిల్లాకు పాదయాత్ర చేరుకుంటుందన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ కౌన్సిలర్లతో కలసి షేక్ జిలానిని ఘనంగా సత్కరించారు.

అభివృద్ధికి అడ్డువస్తే సహించేది లేదు

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- అన్నవరప్పాడులో గడప గడపకూ..



అన్నవరప్పాడులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధికి ఎవరు అడ్డు వచ్చినా సహించేది లేదని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు స్పష్టం చేశారు. మండలంలోని అన్నవరప్పాడులో శుక్రవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో టీడీపీ, జనసేనలు రెండూ ఒకరి చేతుల్లోనే ఉన్నాయన్నారు. తమ ఉనికిని కాపాడుకోవడానికే వారు తప్పుడు రాజకీయాలు చేస్తున్నారన్నారు. అలాంటి వారి మాటలను నమ్మవద్దని గ్రామస్తులను ఎమ్మెల్యే కోరారు. గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు చేసింది, పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చింది జగన్ ప్రభుత్వమే అని ఆయన గుర్తు చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏ ఒక్కరికైనా ఒక్క సెంటు స్థలం ఇచ్చారా అని శ్రీనివాస్ నాయుడు ప్రశ్నించారు. పార్టీ శ్రేణులు, అధికారులతో కలసి ఆయన గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా ప్రజలను పలకరించారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా?అని అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, సర్పంచ్ పంతం బాలసుందరి, సొసైటీ అధ్యక్షుడు పంతం నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు వసంతాడ బుజ్జి, పంతం సత్యనారాయణ (చిన్న) కోటిపల్లి రాంబాబు, గుత్తుల మహాలక్ష్మి, వేంద్ర కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, ఐహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిడదవోలు డివిజన్
90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com

శ్రద్ధాంజలి

జననం: 20-11-1953
మరణం: 03-10-2023
శ్రీ ఎస్.పి.శంకరం (సరిదే) గారు
రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, పంచాయితీరాజ్, నిడదవోలు
చెరగని చిరునవ్వుతో అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ,
అహర్నిశలు కుటుంబ ఉన్నతికి కృషి చేసి అందరి హృదయాలలో
చెరగని ముద్ర వేసుకున్న మీ మరణం మాకు తీరనిలోటు.
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
భార్య: వెంకటరమణ (లేటు)
కుమారులు - కోడళ్ళు:
ఎస్.రామజోగేశ్వరరావు - రేఖారాణి
MBA, Manager, Chettinadu Cements, Puducherry
ఎస్.ఎల్లారీశ్వర ప్రసాద్ - సత్యవాణి
MCA, MHRM, Operations Head, Microsoft, HYD
కుమార్తె - అల్లుడు: పి.భవాని - కృష్ణవంశీనాథ్
Chief Manager, SBI, Nanded
మనుమలు, మనుమరాండ్రు: ఎస్.సాయిచైతన్య, ఎస్.సాయిశంకర్, పి.సాయి శంకర్ కేశవనాథ్, పి.శ్రీ సాయి చంద్రమౌళిక
ఎస్.వెంకట రమణ
పెదకార్యం: ది.14.10.2023 శనివారం నిడదవోలు చింతచెట్టు వీధి, లోని శ్రీ రాఘవేంద్ర భవన్ మా స్వగృహము నందు జరుగును.
సెల్: 94405 12525, 90321 20417